క్లుప్తంగా

'చవితి' శుభాకాంక్షలు



వినుకొండ: నియోజక వర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో వినాయక చవితి పర్వ దినాన్ని జరుపుకోవాలని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు మాజీఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆకాంక్షించారు. ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు పోకుండా ప్రశాంత వాతావరణంలో పండుగ ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.

సీసీ ఫుటేజా... మజాకా!

నరసరావుపేట టౌన్: బేకరీలో దొంగతనానికి పాల్పడ్డ నిందితుడిని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. మల్లమ్మసెంటర్ సమీపంలోని బేకరీ మార్ట్ షట్టర్ తాళాలు పగులగొట్టి క్యాష్ కౌంటర్‌లో నగదు ఆదివారం అర్ధరాత్రి అపహరించుకు వెళ్లిన సంగతి విదితమే. బేకరీ నిర్వాహకుడు హర్షవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. బేకరీలో లభ్యమైన సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడు ఎస్‌ఆర్‌కేటీ కాలనీకు చెందిన పాతనేరస్తుడు ఆరీఫ్‌గా గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని చోరీ చేసిన సొత్తును రికవరీ చేశారు. బుధవారం కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలియవచ్చింది.

భార్య, కుమారుడు అదృశ్యం

నరసరావుపేట టౌన్: భార్య అదృశ్యంపై భర్త ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్ మంగళవారం తెలిపారు. బాపయ్యనగర్‌కు చెందిన షేక్ సుభానికు నాదెండ్ల మండలం తూబాడు గ్రామానికి చెందిన షేక్ కౌసర్‌తో నాలుగు సంవత్సరాల క్రితం వివాహమైంది. వీళ్లు బాపయ్యనగర్ ఆంజనేయస్వామి గుడి సమీపంలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం బజారు నుంచి ఇంటికి వచ్చి చూడగా భార్య, రెండేళ్ల కుమారుడు కనిపించలేదు. వాళ్ల ఆచూకీ కోసం ఎంత గాలించినా ప్రయోజనం దక్కలేదు. అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడిపై అనుమానం ఉందని భర్త ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఘనంగా మదర్ థెరిస్సా జయంతి



నరసరావుపేట: స్థానిక మదర్ థెరిసా హాస్పిటల్‌లో మంగళవారం నిర్వహించిన మదర్ థెరిసా జయంతి వేడుకలకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే స్వతహాగా డాక్టర్ కావటంతో హాస్పటల్‌కి వచ్చిన చిన్నారులకు వైద్యం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మదర్ థెరిసా చేసిన అపూర్వ సేవలను కొనియాడారు. హాస్పిటల్‌కు ఆమె పేరు పెట్టడం గొప్ప ఆలోచన అని, ఈ నిర్ణయం పట్ల హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్‌రావు, నాయకులు శేషగిరిరావు పాల్గొన్నారు.

ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను నిరోధిస్తాం

మండల ప్రత్యేక అధికారి మూలె వెంకటరెడ్డి



శావల్యాపురం: ఎరువులు బ్లాక్ మార్కెట్ నిరోధించడంతోపాటు కృత్రిమ కొరత లేకుండా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మండల ప్రత్యేక అధికారి మూలె వెంకటరెడ్డి వెల్లడించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎరువులు దుకాణదారులు, సొసైటీ సీఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టరు ఆదేశాల మేరకు వ్యవసాయ సీజను ప్రారంభంలో ఉందని ఎరువులు కొరత లేకుండా రైతులు ఇబ్బందులు పడకుండా ఉండటానికి ప్రభుత్వ నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలన్నారు. డీఏపీ, యూరియా లాంటి ఎరువులు వినియోగాన్ని అవసరాన్ని మించి రైతులు వినియోగించరాదన్నారు. రసాయనిక ఎరువులు మోతాదుకు మించి వినియోగిస్తే భూమి సారవంతం కోల్పోతుందన్నారు. అనంతరం గ్రామంలోని మన గ్రోమార్ సెంటరు ప్రవేటు ఎరువుల దుకాణాలు సందర్శించి రికార్డులు తనిఖీ చేసి తగు సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు షాపు లైసెన్సు రద్దు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఎం.అర్జున్‌నాయక్, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు, సీఈవోలు జాలాది నాగప్రసాదు, వైవీ నారాయణ ఉన్నారు.

గజాననాయనమః



వినుకొండ గీతాంజలి స్కూల్స్ విద్యార్థులు వినాయక చవితి సందర్భంగా గణపతి రూపంలో మానవహారం ఏర్పాటుచేశారు. విద్యార్థులందరూ స్కూల్ యూనిఫాంతో గణపతి ఆకారంతో కూర్చొని అలరించారు. ప్రిన్సిపాల్ శ్రీమతి తేళ్ళ కృష్ణవేణి మాట్లాడుతూ చిన్నారులకు ఎంతో ఇష్టమైన పండుగలలో వినాయక చవితి ఒకటి వినాయక చవితి విశిష్టతను విద్యార్థులకు తెలియజేసేందుకు గణపతి మానవహారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

–వినుకొండ

మట్టి గణపయ్యకు జై



రొంపిచర్ల మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు గ్రామంలోని వారికి మట్టి వినాయకుని ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు ట్రూప్, డొక్కా సీతమ్మ ట్రూప్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యులు పాల్గొన్నారు.

రొంపిచర్ల

సహజ సిద్ధంగా...



చిలకలూరిపేట జీవీ ఐఐటీ పాఠశాలలో మంగళవారం పర్యావరణానికి హాని కలగని సహజ పదార్థాలతో వినాయక విగ్రహాల తయారీ పోటీని వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు అద్భుతమైన గణనాథ విగ్రహాలను తీర్చిదిద్దారు. పాఠశాల చైర్మన్ పారేపల్లి ఉదయ్‌కుమార్, ప్రిన్సిపాల్ దేవులపల్లి ఫణికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

–చిలకలూరిపేటటౌన్

గీతమ్స్ బ్లూమ్స్‌లో...



పట్టణంలోని కారంపూడి రోడ్డులోగల గీతమ్స్ బ్లూమ్స్ పాఠశాలలో మంగళవారం వినాయక చవితి ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి హాజరై విద్యార్థినీ విద్యార్థులకు వినాయక చవితి శుభాకాంక్షలుతెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతీయులు జరుపుకునే పండుగలలో వినాయక చవితి విశిష్టమైనదని అన్నారు.

–వినుకొండ

ఫొటో సేకరణ త్వరితగతిన పూర్తి చేయండి

ఆర్డీవో కె.మధులత



మాట్లాడుతున్న ఆర్డీవో మధులత

శావల్యాపురం: రీసర్వే జరిగిన రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేయాల్సిన నూతన పట్టాదారు పాసుపుస్తకాల్లో తప్పులు సవరణలు మార్పులు చేర్పులు ఫొటోల సేకరణ పనులు పారదర్శకంగా చేయాలని నరసరావుపేట ఆర్డీవో కె.మధులత తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ అధికారులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మధులత మాట్లాడుతూ నరసరావుపేట డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 84 వేల పట్టాదారు పాసు పుస్తకాలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. శావల్యాపురం మండలంలో 1338 మంది రైతుల దగ్గరి నుంచి నూతన పట్టాదారు పాసుపుస్తకాలపై ముద్రించాల్సిన పాస్ ఫొటో సైజ్‌ఫొటోలు సేకరణ పనులు జాప్యం కావటంతో రెవెన్యూ అధికారులు సంబంధిత గ్రామ వీఆర్వోల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. పోట్లూరు-598, వేల్పూరు-271, పిచికలపాలెం-155, కనమర్లపూడి-314 గ్రామాల్లోని రైతుల నుంచి ఫొటోలు సంబంధిత వీఆర్వోలు సేకరించాలని, తదపరి తహసీల్దారు లాగిన్ ద్వారా ఆన్‌లైన్ నమోదు చేస్తారన్నారు. వారం రోజుల వ్యవధిలో ఈప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జిల్లాస్థాయిలో ఫొటోలు సేకరణలో శావల్యాపురం మండలం పూర్తిస్థాయిలో వెనకంజలో ఉందన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలకు సంబంధించి రైతుల జాబితాను గ్రామ సచివాలయాల్లో ప్రచురణ చేశామన్నారు. పొలాలు కల్గియుండి దూర ప్రాంతాల్లో ఉన్న వారందరూ నేటి వరకు ఫొటోలు వీఆర్వోలకు అందజేయని వారంతా సత్వరమే ఫొటోను అందజేయాలన్నారు. అన్ని గ్రామాల్లోని వీఆర్వోలు ఇప్పటి వరకు 9 వేల కుల ధ్రువీకరణ సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలోని కొత్తలూరు గ్రామంలో రీసర్వే పనులు పూర్తికాగా ప్రస్తుతం రికార్డు పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దారు యం.అర్జున్‌నాయక్, డిప్యూటీ తహసీల్దారు సుబ్బారావు, ఆర్ఐ చంద్రబాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

అర్థమయ్యేలా పాఠాలు బోధించాలి

- దత్తత పాఠశాల ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచన
- లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో సంభాషణ



విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట రూరల్: సిలబస్ పూర్తిచేయడమే లక్ష్యంగా పెట్టుకోకుండా విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు సూచించారు. దత్తత పాఠశాల లింగంగుంట్ల శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్‌ను మంగళవారం కలెక్టర్ సందర్శించారు. తరగతి గదిలో ఆయన ఓ ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థుల విద్యాభ్యాస పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థుల అభ్యాసన స్థాయిని అంచనా వేసేందుకు సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి ప్రాథమిక అంశాలపై పట్టు సాధించేలా చేయడంపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. వారంలో రెండు సార్లు పాఠశాలను సందర్శించి బోధనా పద్ధతులను సమీక్షించాలని డీఈవో చంద్రకళను ఆదేశించారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు.

వీధి కుక్కల దాడిలో గొర్రెలు హతం



శావల్యాపురం: మండలంలోని ముండ్రువారిపాలెం, చినకంచర్ల గ్రామ పంచాయతీల్లో వీధి కుక్కల వలన జీవాల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు రోజుల నుంచి ఆయా గ్రామాలకు చెందిన జీవాల యజమానులు కమతం పేరయ్య, అన్నవరపు వెంకటేశ్వర్లు, ఇరుగుదండ్ల సుబ్బులకు చెందిన గొర్రెలు, గొర్రె పిల్లలను వీధి కుక్కలు ఇష్టానుసారంగా దాడి చేసి చంపివేసినట్లు బాధితులు తెలిపారు.

జీవాల యజమానులు వాటి సంరక్షణ కోసం రాత్రి పగళ్ళు కాపలాగా ఉంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వీటి విలువ రూ. లక్షన్నర ఉంటుందన్నారు. ఇప్పటికైనా పంచాయతీ కార్యదర్శులు పట్టించుకొని వీధి కుక్కలను పట్టుకొని అడవిలోకి తరలించాలన్నారు.

యూరియా నో స్టాక్

- సొసైటీల్లో ఇదీ పరిస్థితి
- రైతుల అగచాట్లు
- బహిరంగ మార్కెట్లో అధిక ధరకు కొనుగోలు



గణపవరం సొసైటీ భవనం

నాదెండ్ల: ప్రభుత్వం పంటల సాగుకు అవసరమైన యూరియాను రైతులకు అందించటంలో విఫలమౌతోంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే ప్రతి పంటకు యూరియా కావాల్సి ఉంది. పంటను బట్టి యూరియా వినియోగిస్తారు. ప్రస్తుతం మార్కెట్లో యూరియా కొరత ఉండటంతో వ్యాపారులు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. 45 కేజీల యూరియా బస్తా ధరను ప్రభుత్వం రూ.266లుగా ప్రభుత్వం నిర్ణయించింది. అయితే బహిరంగ మార్కెట్లో ప్రైవేటు వ్యాపారులు రూ.330-350ల ధర వసూలు చేస్తున్నారు. 50 కేజీల డీఏపీ ధర రూ.1350 కాగా, బహిరంగ మార్కెట్లో రూ.1500-1600వరకూ వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ రెండు ఎరువులు రైతులకు అత్యవసరం.

గణపవరం సొసైటీలో నిల్వలు నిల్...

గణపవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలో ఐదు గ్రామాలున్నాయి. గణపవరంతో పాటూ అమీన్‌సాహెబ్‌పాలెం, అప్పాపురం, ఇర్లపాడు, కనపర్రు గ్రామాలున్నాయి. సొసైటీ పరిధిలో మూడు వేల మంది రైతులు నమోదైయున్నారు. వీరుకాక మరికొంతమంది రైతులు, కౌలు రైతులు ఉన్నారు. సొసైటీ పరిధిలో 12 వేల ఎకరాల సాగు భూమి ఉండగా, సుమారు 8 వేల ఎకరాల్లో ఖరీఫ్ పంటల సాగు ప్రారంభమైంది. మరో 4 వేల ఎకరాలు రబీలో సాగుకానున్నాయి. మరికొంత భూమిలో సుబాబుల్ సాగులో ఉంది.

కొద్దిరోజుల క్రితం గణపవరం సొసైటీకి 400 బస్తాలు యూరియా సరఫరా కాగా, రైతులు కొనుగోలు చేశారు. అప్పటి నుండి యూరియా నో స్టాక్ బోర్డు ఏర్పాటు చేశారు. ఆదివారం డీఏపీ 400 బస్తాలు, 20-20 ఎరువు 520 బస్తాలు సరఫరా అయింది. రైతులకు కావాల్సిన యూరియా మాత్రం అందకపోవటంతో ఆందోళన వ్యక్తమౌతోంది.

రైతులకు అవసరమైన సమయంలో యూరియా లేకపోవటంతో పంటల సాగుపై ఆందోళన వ్యక్తమౌతోంది. ప్రభుత్వం స్పందించి రైతులకు అవసరమైన యూరియాతో పాటూ విత్తనాలను సబ్సిడీపై అందించాలని రైతులు కోరుతున్నారు. దీనిపై గణపవరం సొసైటీ సీఈవో పెదవల్లి లక్ష్మయ్యను వివరణ కోరగా ఇప్పటికే సొసైటీ పరిధిలోని ఐదు గ్రామాల్లో రైతులకు 20 టన్నులు యూరియా పంపిణీ చేశామన్నారు. మరో 80 టన్నులు ఇండెంట్ పెట్టామని, ఇంకా అందలేదని తెలిపారు. యూరియా అందిన వెంటనే రైతులకు పంపిణీ పూర్తి చేస్తామని తెలిపారు.

3న యడ్లపాడు మండల పరిషత్ సమావేశం

యడ్లపాడు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం సెప్టెంబర్ 3వ తేదీన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. ఉదయం 11 గంటలకు యడ్లపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ పిడతల ఝాన్సీ సాగర్ అధ్యక్షతన ఉంటుందన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సు రద్దు చేస్తాం

నాదెండ్ల: యూరియా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే అటువంటి షాపు లైసెన్సులు రద్దు చేస్తామని మండల ప్రత్యేకాధికారి ఎస్ సంజీవరావు చెప్పారు. నాదెండ్ల మండలం చిరుమామిళ్ళ గ్రామంలో ఎరువుల దుకాణాలపై స్థానిక అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో స్వరూపరాణి, ఏవో శ్రీలత, ఎస్సై జి.పుల్లారావుతో కలిసి పలుషాపులను తనిఖీ చేశారు. భౌతిక నిల్వలు, రికార్డుల్లో నిల్వ వివరాలు పరిశీలించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

చిలకలూరిపేటటౌన్: యంగ్ మ్యాన్ క్రిస్టియన్ అసోసియేషన్ (వైఎంసీయే) ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని చీరాల రోడ్డులో ఉన్న బాపూజీ వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం జరిగింది. మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని, అలాగే ఆ సంస్థ జిల్లా ప్రతినిధి చుక్క విన్సెంట్ పాల్ పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్సీయం చర్చి ఫాదర్ థామస్ హాజరయ్యారు. కార్యక్రమంలో విన్సెంట్ పాల్ కుటుంబ సభ్యులతో పాటు జె రామమోహన్, న్యాయవాది దాసరి చిట్టిబాబు , అలవాల ఫణికుమార్, దార్ల బుజ్జిబాబు, ఆశ్రమ నిర్వాహకులు మురికిపూడి ప్రసాద్ తదితరులున్నారు.

పురుగుమందుల తయారీ కేంద్రాల పరిశీలన



ఎరువుల నిల్వలు పరిశీలిస్తున్న జగ్గారావు

నాదెండ్ల: కనపర్రు, సాతులూరు గ్రామాల్లోని పురుగుమందుల తయారీ కేంద్రాలను జిల్లా వ్యవసాయాధికారి జగ్గారావు మంగళవారం తనిఖీ చేశారు. మైక్రో న్యూట్రియంట్, పురుగుమందుల తయారీ ప్రక్రియ వివరాలు పరిశీలించారు. అనంతరం సాతులూరులోని రైల్వే రేక్ పాయింట్‌లో ఎరువుల నిల్వలు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక వ్యవసాయాధికారులకు పలు సూచనలు చేశారు. పంట నమోదు ప్రక్రియ, ఏపీఏ ఐఎంఎస్ యాప్ నందు పెస్ట్ సర్వేలైన్స్ ప్రక్రియ, మొబైల్ అప్లికేషన్ వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. డీలర్లకు రేక్ పాయింట్ నుంచి ఎంతెంత నిల్వలు సరఫరా చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటూ జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు హనుమంతరావు, జిల్లా కార్యాలయం ఏవో శ్రీనివాసరావు, వెంకటరావు, నాదెండ్ల ఏవో టి.శ్రీలత, ఏఈవో శ్రీనివాసరావు, రమేష్ ఉన్నారు.

ఎరువులు దుకాణాల్లో తనిఖీలు

ఈపూరు(శావల్యాపురం): మండలంలోని ముప్పాళ్లలో మండల ప్రత్యేక అధికారి ఐ.వెంకట్రావు, జిల్లా ఉద్యాన అధికారి షేక్ నబీ రసూల్ సారథ్యంలో ఎరువులు పురుగుమందుల దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు ఎరువుల దుకాణాల్లో స్టాకు రిజస్టరు, రశీదు పుస్తకాలను ఈ-పాస్ మిషన్‌లో ఉన్న బ్యాలెన్స్ నిల్వలు గోదాంలో ఉన్న ఎరువుల లభ్యతను పోల్చి చూశారు. అదేవిధంగా యూరియా డీఏపీ కాంప్లెక్సు ఎరువులు రైతులకు నిరంతరం అందుబాటులో ఉంచాలని ఎమ్మార్పీ ధరలకు మించి అమ్మరాదన్నారు. ఆయనతో పాటు ఏవో రామారావు ఉన్నారు.

అర్హత కల్గిన రైతులకు రుణాలిస్తాం

ఎస్‌బీఐ నరసరావుపేట రీజనల్ మేనేజరు రవికుమార్




ఖాతాదారుడిని సత్కరిస్తున్న రీజనల్ మేనేజరు

శావల్యాపురం: ఎస్‌బీఐ బ్యాంకు శాఖ వారి సారథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని అర్హత కల్గియున్న రైతులందరికీ రుణాలు మంజూరు చేస్తామనిఎస్‌బీఐ నరసరావుపేట రీజనల్ మేనేజరు (ఆర్ఎం) పి.రవికుమార్ అన్నారు. మండలంలోని మతుకుమల్లి గ్రామంలోని ప్రధాన కూడలి మార్గంలో ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాదారులు రైతులకు బ్యాంకు పథకాలపై బీమా యోజన తదితర వాటిపై అవగాహన సదస్సు శావల్యాపురం ఎస్‌బీఐ బ్యాంకు శాఖ మేనేజరు వలేటి ప్రసాదు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజరు రవికుమార్ మాట్లాడుతూ ఆర్‌బీఐ ఆదేశాల మేరకు బ్యాంకు ఖాతా కల్గియున్న వారందరు కేవైసీ నమోదు చేయించాలన్నారు. అర్హత కల్గియున్న రైతులకు రూ.5 లక్షల నుంచి రూ.50 కోట్లు వరకు రుణ సదుపాయం అందజేయు ఏకైక బ్యాంకు శాఖ ఎస్‌బీఐ అన్నారు. సంప్రదాయ వ్యవసాయ పద్ధతుల నుంచి ఆధునీకరణ వ్యవసాయం చేసే విధంగా వ్యవసాయ యంత్రపరికరాలు ద్వారా రైతులను ప్రోత్సహించి వారి ఆర్థిక ప్రగతికి సాధించడానికి తమవంతు కృషి చేస్తామన్నారు. అలాగే స్వయం సిద్ధ పథకం ద్వారా స్వయం సహాయక మహిళా గ్రూపుల్లోని ఒక్కో సభ్యురాలకు యూనిట్ రూపంలో రూ.10 లక్షలు వరకు రుణాలు మంజూరు చేస్తామన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించిన ఖాతాదారులకు రుణాలు పెంపుదల చేస్తామన్నారు. బ్యాంకుల్లో దళారులు ప్రమేయం లేకుండా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. త్వరలో వినుకొండ ఉన్న గుమ్మనంపాడు ఎస్‌బీఐ బ్యాంకు అదే గ్రామంలో నూతన బ్రాంచ్ ఏర్పాటుకు అనుమతులు వచ్చినట్లు తెలిపారు. అవగాహన సదస్సులో శావల్యాపురం, కారుమంచి ఎస్‌బీఐ బ్యాంకు శాఖల మేనేజర్లు వలేటి ప్రసాదు,సునీల్, చీఫ్ మేనేజరు పాల్,, ముప్పింగి కిరణ్ రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ గణపతి



సింథటిక్ రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌కు దూరంగా పర్యావరణ హితమైన మట్టి గణపతి మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో కొలువుదీరాడు. శ్రీకోదండరామాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చలువ పందిరిలో ఆరడుగుల మట్టి వినాయకుడు పూజలందుకుంటున్నాడు. గ్రామానికి చెందిన కందిమళ్ళ రాఘవరావు జ్ఞాపకార్థం వారి కుటుంబీకులు అనురాధ, శివనాగేశ్వరరావు, పవన్‌కుమార్ సుమారు రూ.20 వేల విలువైన మట్టి గణనాథుడిని గుంటూరు నుండి తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. నాలుగో రోజు 30న స్వామివారిని అదేస్థలంలో నీటితో నిమజ్జనం చేయనున్నారు.

–నాదెండ్ల

చలపతిరావు సేవలు అభినందనీయం



చలపతిరావును సత్కరిస్తున్న కలెక్టరు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు వాసి ప్రకాశం జిల్లా మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలల్లో హెల్త్ ఏడ్యూకేటర్‌గా విధులు నిర్వహించుతున్న సంద్రపాటి చలపతిరావు సేవలు అభినందనీయమని కలెక్టరు పి.అరుణ్‌బాబు అన్నారు. జిల్లాలో 2025 సంవత్సరంలో 12 మంది వేల్పూరు వాసులను నేత్రదానం చేయించేందుకు ప్రోత్సహించనందుకుగాను ఉత్తమ సేవలకు ప్రత్యేకంగా అభినందించి కలెక్టరు కార్యాలయంలో మంగళవారం సత్కరించారు. జిల్లా కలెక్టరు పి.అరుణ్‌బాబు మాట్లాడుతూ వైద్య శాఖ అధికారులు సిబ్బంది సంద్రపాటి చలపతిరావు సేవలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు, సత్కరించిన వారిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టరు. జి.రవి, జిల్లా అంధత్వ నివారణ కోఆర్డినేటరు డాక్టరు భువనేశ్వరి, తదితరులు ఉన్నారు.